# గంగిగోవు

-వి.హేమ

"అమ్మా ఆ ఆ..." దీర్ఘంగా, హృదయ విదారకంగా ఉంది ఆ కేక. దొడ్డి వరండాలో పడుకుని ఉన్న సుభద్రమ్మ ముసలి ఆవు గంగ అరిచిన అరుపుకి ఉలిక్కిపడి లేచి కూర్చుంది. కళ్లు నులుముకుంటూ వెళ్లి దొడ్లో చెట్ల చాటున ఉంచిన కుడితి బకెట్ అందుకుని, దొడ్డి తలుపు తెరుచుకుని వీధిలోకి వచ్చింది. 'గంగ ఇంత లేటు చేసిందేమిటి ఈవేళ, ఎందుకనో!' అనుకుంటూ గుమ్మం దాటి రోడ్డుమీదకి నడిచింది సుభద్రమ్మ, నిద్రమత్తులో ఉండడంతో గంగ అరుపులోని ఆర్తి ఆమె కనిపెట్టలేకపోయింది.

"ఆకలి బాధ అన్ని బాధల్లోకీ మహా చెడ్డది. దానికి గొప్పా..బీదా, చిన్నా - పెద్దా అన్న వివక్ష లేదు సరిగదా, మనిషా జంతువా అన్న బేధం కూడా లేదు. పాపం గంగ! అని సణుక్కుంటూ కుడితి బకెట్టు గంగ ముందు ఉంచింది. ముసలిదైపోయిందని రోడ్డుమీదకి తోలేశాక కూడా గంగ రాత్రయ్యేసరికి, రోజూ నా ఇల్లు వెతుక్కుంటూ వచ్చి, మూసి ఉన్న దొడ్డి గుమ్మం వెలుపల గోడవార పడుకొని నిద్రపోయేది.

అది ఇంట పుట్టిన దూడ! పెరిగి పెద్దదై పాడి ఆవుగా మారి ఆ ఇంటికి కావల్సిన పాలు ఇచ్చింది పదిహేనేళ్లకు పైగా. సుభద్రమ్మకి మూడవ కాన్పు సమయంలో జబ్బు చేసి పసిపిల్లకు పోతపాలు పొయ్యాల్సి రావడంతో పాడి కోసం ఆవుని తోలుకు వచ్చారు.

ఆ ఆవు బిడ్డ ఈ గంగ. నుదుట నల్లని మచ్చతో, మల్లెపూవులాంటి తెల్లని శరీరంతో ఇది గంతులేస్తూ, పరుగులు పెడుతూంటే మహా ముద్దుగా ఉండేది. అప్పటికి పదేళ్ల వయసున్న తన కొడుకు సురేష్ దానిని చేరదీసి దాంతో ఆడేవాడు. తరువాతి కాన్పుల్లో పుట్టిన లేగదూడల్ని పాలు మానగానే పొలానికి తోలి పెట్టినా, దీన్ని మాత్రం తమ దగ్గరే ఉంచుకున్నాడు సురేష్ పట్టుదలతో. ఇది పెరిగి, పెద్దదై పాలివ్వడం మొదలెట్టగానే, రెండావులెందుకని పెద్దావుని అమ్మేద్దాం అనేవాడు తన భర్త.

కానీ దానిని ఆయన పోయినప్పుడు ఆయన సూక్ష్మదేహాన్ని వైతరిణీ నది దాటించడం కోసం దానంగా ఇచ్చారు.

తన పిల్లలతోపాటుగా సాకిన అభిమానంతో గంగని కొడుకు రోడ్డుమీదకి పంపించేశాక కూడా సుభద్రమ్మ దానిని, దాని ఖర్మానికి వదిలేసి ఊరుకోలేకపోయింది. ప్రతీరోజూ వంటింటి వ్యర్థాల్ని - కూరగాయ తొక్కలు, గంజి, మిగిలిపోయిన పదార్థాలు, పిల్లలు పారేసిన తినుబండారాపు వస్తువులు, దొడ్లో మొక్కల మధ్య పెరిగిన గడ్డి లాంటి వన్నీ ఒక పాత ప్లాస్టిక్ బకెట్‌లో చేర్చి, దాచి, గంగ గుమ్మంలోకి వచ్చి అరవగానే తీసుకెళ్లి దాని ముందుంచి, ప్రేమగా దాని గంగడోలు నిమిరి సముదాయించేది ప్రతీ రాత్రి కొడుకు, కోడలూ మేడమీదికి వెళ్లిపోయిన తరువాత.

కుడితి బకెట్ ముందుంచి దాని మెడ నిమురుతున్న సుభద్రమ్మకి గంగలో ఏదో తేడా ఉందని పించింది.

వీధి దీపపు గుడ్డి వెలుగులో, కేటారాక్టుతో మసకలు కమ్మిన కంటిచూపుని కేంద్రీకరించి చూసిన సుభద్రమ్మకి గంగ కళ్ల వెంట నీరు కారుతూం డటం తెలిసింది.

"ఏమైందే తల్లీ నీకు" అని అడుగుతూ దాని మెడచుట్టూ చేతులు వేసి దాన్ని ఆప్యాయంగా కౌగిలించుకుంది సుభద్రమ్మ.

నేల మీద పడుకుని ఉన్న గంగ అశాంతిగా అటుఇటూ దొర్లి "అమ్ బా ఆ..." అంటూ ఆక్రోశించింది.

అంతలోనే గంగకు వెక్కిళ్లు మొదలయ్యాయి. బెక్కి బెక్కి పెద్దగా వాంతి చేసుకుంది గంగ. తుట్టెలు తుట్టెలుగా బయటపట్టాయి ప్లాస్టిక్ సంచులు. గంగ కళ్లు తేలేసింది. సుభద్రమ్మ వైపుగా చూస్తున్న గంగ కళ్లల్లోని జీవకళ క్రమంగా హరించిపోయింది.

తన చేతుల్లోని గంగ శరీరం బరువెక్కడం తెలిసింది సుభద్రమ్మకి. గంగ ఇక లేదు అన్నది ఆమెకు అర్థమైపోయింది. ఆమె గుండెలలోని దుఃఖం పెల్లుబికింది. ఆ ఆవుని గురించిన జ్ఞాపకాలతో ఆమె మనసంతా నిండిపోయింది.

సరిగ్గా నాలుగు నెలల క్రితం ఆమె కడసారపు కూతురు శార్వరి పుట్టినరోజు జరిగింది. ఆమెకు ఇరవై ఏళ్లు నిండాయి. ఆ రోజున అనుకుంది తను గంగకి కూడా ఇరవై నిండాయి అని. కానీ గోవు ఆయుష్షు ఇరవై సంవత్సరాలే కావడంతో శార్వరికి యవ్వనమైన వయసే గంగకి వృద్ధాప్యమయ్యింది. వయసు ఉడిగిపోవడంతో చూలూ పాలూ కూడా ఆగిపోయాయి. అక్కడితో అది ఎవరికీ పనికి రానిదైపోయింది. అంతవరకు అది చేసిన ఉపకారమంతా కనుమరుగైపోయింది.

ఆ రోజు ఆదివారం కావడంతో ఉద్యోగస్తులైన కొడుకు కోడలూ కూడా ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం భోజనాలు కాగానే "కాసేపు నిద్రపోతా"నంటూ మేడమీదకు వెళ్లిపోయాడు సురేష్. కోడలు మీనాక్షి మాత్రం హాల్లోని వస్తువులు అటూ ఇటూ సర్దుతూ కిందనే ఉండిపోయింది. పిల్లలు టీవీ చూస్తూ కూర్చున్నారు. అంతలో దొడ్డి గుమ్మం తడుతూ ఎవరో కేక వేయడం వినిపించింది. తలుపు తీయడానికి తోసింది సుభద్రమ్మ. తమ ఇంటికి వంద గజాల అవతల ఉన్న నాలుగు వీధుల మొగలో మాంసం కొట్టు పెట్టుకున్న పీర్ సాయిబు లోపలకు వచ్చాడు.

"ఆ! వచ్చావా! ఆ కొట్టంలో ఉన్నదే ఆవు... చూడు" అంది తను వెనకే వచ్చిన మీనాక్షి అతన్ని లోపలకు ఆహ్వానిస్తూ.

పీర్‌సాయిబు రాక ఎందుకో అర్థంకాక ప్రశ్నార్థక దృష్టితో కోడలి వైపు చూసింది సుభద్రమ్మ.

"గంగని అమ్మేస్తున్నా" అంటూ ముక్తసరిగా జవాబిచ్చింది కోడలు.


"పీరు సాయిబుకా?" ఆక్రోశించినట్లుగా కెవ్వుమంది సుభద్రమ్మ.

"ఆ, మరే! పీరుసాయిబుకే. ఒట్టిపోయిన గొడ్డును ఇంకెవరు కొంటారు? గుట్టం గుడ్డిదైనా దానాకి తక్కువ కాదు అన్నట్లు మేపడం తప్పటం లేదు. అది ఒట్టిపోయినా, ఏ ప్రయోజనంలేని దీన్ని

ముప్పొద్దులా మేపాలంటే మాటలా? పిల్లలుగల వాళ్లం!'' రుసరుసలాడింది మీనాక్షి.

"సందెడు ఎండుగడ్డి, అర బక్కెట్ నీళ్లు -అంతే కదా'' అందామనుకుంది సుభద్రమ్మ. కానీ కోడలి ధుమధుమలకు జడిసి తెరచిన నోరు మూసేసుకుంది. తను మాట్లాడితే మాత్రం ఎవరు పట్టించుకుంటారు కనుక అని సరిపెట్టేసుకుంది.

"భర్త రాజ్యం తన రాజ్యం, కొడుకు రాజ్యం పరరాజ్యం'' అని ఒక సామెత ఉంది, కానీ గంగిగోవులాంటి సుభద్ర ఏనాడూ ఏ రాజ్యం ఏలింది లేదు. అత్తగారు బ్రతికుండగా ఆమె నోటికి జడిసి నోరు విప్పలేదు. ఇక ఇప్పుడు చూస్తే ఏ మాట్లాడినా పెడర్థాలు తీస్తూ, తప్పులు పట్టే కోడలంటే భయంతో నోరు విప్పి మాట్లాడాలంటేనే వెనకాడుతోంది. చివరకి 'ఊరకుండిపోవడం అంత ఉత్తమం' మరేదీ లేదనే నిర్ణయానికి వచ్చేసింది సుభద్రమ్మ.



కానీ ముసలి ఆవు గంగని కబేలాకు తోలేస్తున్నారంటే ఆమె మనసులో దుఃఖం సుళ్లు తిరిగి కళ్లు చమర్చాయి.

మీనాక్షి పీరుసాయిబుతో బేరమాడుతోంది. "మరీ అంత తక్కువైతే ఎలాగ! అమ్మబోతే అడవి - అన్నట్లుంది నీ వ్యవహారం!''

పీరుసాయిబు ముఖం ముడుచుకున్నాడు. "హేమిటీ హమ్మా, నీకీ సెపుతాప్! రోజ్ ఇతనా బడా షెంబూ దూద్ హిచ్చినప్పా రేట్ జాస్తీ హుంటాది. హిప్పూ హేమి హుంది, బొమికల్ తప్ప! దో సౌ రుపియా హెక్కువ. బస్!''

నిద్ర పూర్తయ్యింది కాబోలు సురేశ్ మేడ దిగి "మీనా ఏమిటీ గొడవ'' అంటూ వచ్చాడు.

"ఆ ఏముంది! వట్టిపోయిన గొడ్డుని వదిలించుకోవాలని ఈ సాయిబుని పిలిచా. మరీ రెండొందలే ఇస్తానంటున్నాడు చూడండి! దీని పీడ విరగడైపోతే దొడ్లో పిల్లలకు ఆడుకునేందుకు కాస్త జాగా ఉంటుందని నా ఆశ. కానీ, మరీ అంత తక్కువైతే ఎలా ఇచ్చేసేది?''

"నాతో ఒక్క మాటైనా చెప్పావు కాదేమిటి?'' కోపంగా అడిగాడు సురేశ్.

"ఆ, అదే తప్పయ్యింది మరి! అన్నీ మీకు చెప్పుకు ఛావాలి కాబోలు! నాకొక వ్యక్తిత్వం అన్నది ఏడిస్తేకదా? చిత్తుకాగితాలు,పాత డబ్బాలు

అమ్మేటప్పుడు మీకు చెపుతున్నానా? ఇదీ అంతే అనుకుని స్వతంత్రించా.''

సురేశ్ భార్య రోకాయింపుకి నిరసనగా ముఖం పక్కకి తిప్పుకున్నాడు. చెమ్మగిల్లిన కళ్లతో మౌనంగా ఒక మూలగా నిలబడి ఉన్న తల్లి కనిపించింది. అతనికి ఏమనిపించిందో ఏమోగానీ, సాయిబు వైపు చూసి "ఇదిగో సాయిబూ! మేము ఈ ఆవుని అమ్మేది లేదు. నువ్వు ఇంక వెళ్లిపోవచ్చు'' అంటూ నిష్కర్షగా చెప్పేశాడు. సాయిబు వెళ్లిపోయాడు.

"బాగానే ఉంది మీ తీర్పు. ఎటొచ్చే అనుభవించేది నేనేగా! ఒక్కనాడైనా మీరు ఆవుకి గడ్డైనా వేశారా? దానికి కాసిని నీళ్లు పెట్టిన పాపాన పోయారా ఎప్పుడైనా?'' అంది మీనాక్షి సవాలులా.

"గంగ చిన్న దూడగా ఉన్నప్పటి నుండి ఇప్పటివరకూ దాని సంరక్షణంతా చూస్తున్నది నేనుకదా! కోడలు ఇలా అంటుందేమిటి?'' అనుకుంటూ ఆశ్చర్య పోయింది సుభద్రమ్మ మనసులోనే.

సురేశ్ భార్యకేం జవాబు చెప్పకుండా ఇంట్లోకి నడిచాడు. మీనాక్షికి అరి కాలి మంట నెత్తికెక్కిపోయింది.

వెనుక నుంచి భర్తనుద్దేశించి కేకవేసింది గట్టిగా "ఇదిగో నా మాట వినండి. ఇంక ఈ వట్టిగొడ్డుతో పడడం నా వల్లకాదు. అదే కావాలనుకుంటే మీరు దాన్నే అట్టేపెట్టుకోండి, నేను ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటా తెల్లారేసరికి'' అంది.

మీనాక్షి మొండి పట్టు తెలిసి ఉండడంతో వెనుతిరిగి వచ్చాడు సురేశ్. కొట్టం దగ్గరకు వెళ్లి గంగ మెడలోని పలుపు విప్పేశాడు. వాల్‌పోస్టర్లు ఊడదీసుకు తింటూ మురికి గుంటల్లో నీళ్లు తాగి దాహం తీర్చుకుంటూ అనాథలుగా రోడ్ల వెంట తిరుగుతూ కనిపించే వృద్ధ గోమాతలు అతని కళ్లకు కట్టాయి. గంగ కూడా వాటిలో ఒకటిగా బ్రతుకుతుందిలెమ్మని మనసు సరిపెట్టుకున్నాడు.

తల్లివైపు తిరిగి సురేశ్, సంజాయిషీలా, "అమ్మా! గంగని బయటికి పంపేస్తున్నానమ్మా'' అంటూ దానిని రోడ్డుమీదకు తోలేసి దొడ్డి తలుపు మూసేశాడు.

మనసంతా గంగమీది ధ్యాసతో నిండి ఆ రాత్రి సుభద్రమ్మకి ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు.

మరునాడు దొడ్డంతా చిన్నబోయి కనిపించి కడుపు తరుక్కుపోయింది. కానీ క్రమంగా అదే అలవాటైంది.

ఇదంతా జరిగి నిండా నాల్గు నెలలైనా కాలేదు. అప్పుడే గంగకి ఆయుష్షు కరువైపోయిందా అనుకుంటూ దుఃఖించింది సుభద్రమ్మ, నిర్జీవంగా పడి ఉన్న గంగ శవాన్ని చూస్తూ.

నెమ్మదిగా తూరుపు తెల్లబారింది. జనం ఒక్కొక్కరే లేచి మసలడం మొదలుపెట్టారు.

ఇంకా అక్కడే ఉండడం బాగుండదని లేచి లోపలకు వచ్చేసింది సుభద్రమ్మ.

కానీ గంగని పూర్తిగా గాలికి వదిలిపెట్టలేకపోయింది. హాలులోకి వచ్చి, వీధి వైపు కిటికీ దగ్గర చేరి వీధిలోకి చూడసాగింది.

రోడ్డుమీద తిరుగుతున్న జనం కొందరు రోడ్డు వార పడి ఉన్న ఆవు శవాన్ని చూసి ఆగిపోయారు చాలామంది. హిందువులు కాబోలు క్షణం ఆగి దానికి నమస్కరించి ముందుకి సాగుతున్నారు. అక్కడున్నవారిలో ఒకడు తల గుడ్డ తీసి ఆవు పక్కన పరిచి, తన జేబులో నుండి కొన్ని చిల్లర డబ్బులు తీసి దాని మీద వేశాడు.

దారిన పోతున్న వాళ్లలో చాలామంది ఆగి గోవుకి నమస్కరించి, తమకు తోచినంత డబ్బు తీసి ఆ గుడ్డ మీద వేసి వెడుతున్నారు, మరొక వ్యక్తి అక్కడున్న గబ్బు గలీజు భరించలేక పక్కనే ఉన్న మట్టిగుట్టలోంచి మట్టి తెచ్చిపోసి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేశాడు.

"ఈ ఆవుని చాలా రోజుల్నుంచీ వీధిలో చూస్తూనే ఉన్నాం. పాపం! ఆకలి భరించలేక కాబోలు వాలుపోస్టర్లే కాదు, ప్లాస్టిక్ కారీ బాగులు కూడా తినేసేది. అవన్నీ కడుపులో పోగుపడి ఇలా ప్రాణం తీశాయి కాబోలు'' అంటూ అక్కడ చేరిన జనం తలో మాటా చెప్పుకోవడం మొదలుపెట్టారు. అంతలో అక్కడ చేరిన ముసలమ్మ ఒకామె ఆ ఆవుని ఇటువంటి దుర్దశలోకి నెట్టిన వాళ్లని తూర్పారబట్టింది.

"ఎవరయ్యా ఈ ఆవు తాలూకు మనుషులు? పాలు ఇచ్చినన్నాళ్లు మేపి, దీని పాలు తాగి బలిసిన వాళ్లకి ముసలితనం వచ్చి పాలు ఉడిగిపోగానే వీధిలోకి నెట్టేసిన పాపం ఊరికే పోతుందా? అంటూ ఆ కక్షను వెళ్లబోసింది, తనను సరిగా చూసుకోని తన పిల్లలమీది అక్కసు ధ్వనించేలా.


"తల్లితండ్రుల్నే ఒగ్గేసే ఈ నాయాళ్లు ఆవుల్ని ఏడ పోసిస్తారమ్మా! ఎల్లెల్లు, సుద్దులు మా బాగా సెప్పేవ్‌లే అవ్వా!'' అన్నాడు కలబండీ తోసుకొచ్చిన ముసలయ్య తన పిల్లల్ని తలుచుకుంటూ.

వీధుల్లో సందడికి మెలకువ రాగా లేచి వచ్చిన మీనాక్షీ సురేశ్‌లు వాళ్ల



## ప్రియాంక కోరికలు

'క్రిష్', 'డాన్' సినిమాలతో ప్రియాంక చోప్రాకు బాలీవుడ్‌లో క్రేజ్ వచ్చింది. మోడల్ రంగం నుంచి సినిమా రంగంలోకి వచ్చిన ప్రియాంకకు రెండు కోరికలున్నాయిట. అదేంటని అడిగితే "చారిత్రాత్మక చిత్రంలో నటించాలనేది ఒకటైతే, మరోటి సంగీతంలో కొంచెం ప్రవేశమున్న తను స్వయంగా పాటలు పాడి ఆల్బమ్ విడుదల చేయాలన్నది మరో కోరికట. ప్రియాంక చోప్రా కోరికలు త్వరలోనే తీరాలని మనసారా కోరుకుందాం. ఆల్ ది బెస్ట్ ప్రియాంకా!



మాటలు విని మొహమొహాలు చూసుకున్నారు గుంభనంగా.

సురేశ్ మాట్లాడకుండా వెళ్లి దోసెడు చిల్లర తెచ్చి పరిచి ఉన్న తువ్వాలు మీద పోశాడు. మీనాక్షి జరీపూలున్న పట్టు చీరతెచ్చి క్షణక్షణానికీ ఉబ్బిపోతున్న గంగ పొట్టమీద కప్పింది. గబగబా దొడ్డివైపు వెళ్లింది.

ఇదివరకు గంగ ఉండే కొట్టాన్ని పీకి చదును చేసి అక్కడ బంతిమొక్కలు, ఇంకా ఎన్నో రకాల కూరగాయల మొక్కలు పాతారు. బంతిమొక్కలు పూతకొచ్చాయి.

ఆ పూలను కోసి తెచ్చి అత్తగారి ముందు పోసింది మీనాక్షి. దండగా గుచ్చుమంటూ పూలకు తన కన్నీటి బొట్లు జోడించి మాల కట్టింది సుభద్రమ్మ.

సుభద్రమ్మ గుచ్చిన దండలు తీసుకెళ్లి గంగ మెడలో వేసి, కొమ్ములకు చుట్టి దాన్ని అలంకరించింది మీనాక్షి.

ముఖానికి పసుపు రాసి, కుంకం బొట్టు పెట్టింది. అగరవత్తులు వెలిగించి తెచ్చి అక్కడ పెట్టింది.

వార్త ఎలా అందిందో మరి ఆషామాషీ టీవీ ఛానల్ వాళ్లు కెమేరా వగైరాలతో పరుగున వచ్చారు.

"హిందువులకు పూజనీయమైన గోమాత పరమపదయాత్ర" అనే కాప్షన్‌తో దానిని ఈ రోజే ప్రసారం చేయాలనుకొంటున్నామని చెప్పారు. ఒక భజన సంఘం వాళ్లు వచ్చి హరినామ సంకీర్తనం చేయడం మొదలుపెట్టారు. బట్టపరిచిన వ్యక్తి చాలినంత డబ్బు సమకూరగానే, లారీ తీసుకురావడానికి వెళ్లాడు. కొందరు ముత్తయిదువలు వచ్చి పసుపు కుంకాలతో గోవుకి పూజలు చేశారు. దీపం వెలిగించి తలదిక్కున పెట్టారు.

ఈ సంరంభం అంతా చూస్తున్న సుభద్రమ్మకి దుఃఖం ఆగలేదు. "బ్రతికుండగా పట్టెడు గడ్డికి, గుక్కెడు నీళ్లకూ నోచుకోని ఈ జీవికి చచ్చిపోయాక చేసే ఈ సంబరాలన్నీ ఏం మేలు చేస్తాయి" అనుకుంటూ దుఃఖం పట్టలేక మనసారా ఏడ్చింది సుభద్రమ్మ ముఖానికి కొంగుచాటు చేసుకొని, గంగ పరలోకయాత్రకు సన్నాహాలు పూర్తయ్యాయి.

"గోవింద, గోవిందా" అంటూ పదిమంది వస్తాదుల్లాంటి వాళ్లు పూనుకుని గంగ శవాన్ని బలంగా లేపి లారీ బండి మీదికి చేర్చారు. భజన సంఘం వాళ్లు బండి ముందు దైవ నామాన్ని కీర్తిస్తూ అడుగులు వేస్తుంటే జనం పూలు జల్లుతూ వెంట నడవగా ఊరేగింపుగా మొదలయ్యింది శవయాత్ర. అంగరంగ వైభోగంగా ఊరంతా తిప్పి మరీ గంగ పార్థివ దేహాన్ని ఊరిబయటికి తీసుకెళ్లి, అక్కడ సమాధి చేసి దానిపై ఒక చిన్న కోట కట్టి తులసి మొక్క పాతాలన్నది వాళ్ల ప్లానుట! ఆ మైదానంలో అప్పటికే, హిందువులకు తల్లిలాంటి గోమాతలు ఎన్నిటికో సమాధులు ఏర్పరచి వాటిపై తులసికోటలు కట్టడం జరిగింది. ఈ తంతంతా టీవీలో వస్తుందని తెలియగానే జనం మరీ రెచ్చిపోసాగారు. కానీ ఇంతమంది జనంలో నిజంగా గంగని గురించి మనసా ఆలోచిస్తున్నది సుభద్రమ్మ ఒక్కర్తే.

గంగ అంటే నిజంగా గంగిగోవే! శుద్ధ సాత్వికమూర్తి! ఏనాడూ అది పసిపిల్లలు వచ్చి కాళ్లకి అడ్డం పడినా, కొమ్ము విసిరిన పాపాన పోలేదు. మంచి ఒడ్డూ, పొడుగూ, కొమ్ముబలం ఉన్న ఒంగోలు జాతి ఆవు కావడంతో కుంభవృష్టిగా పాలు కురిపించి, అది అందర్నీ సంతోషపెట్టింది. ఎప్పుడైనా దానికి పోషణ తగ్గిన రోజులు ఉన్నాయేమో గానీ, దాని పాలు తగ్గిన రోజులు లేవు! చూలు చూలుకీ మధ్య అది చూడుగట్టి పాలివ్వడం మానెయ్యగానే, అప్పుడు పుట్టిన బిడ్డను - అది పాలు విడవగానే అతనికే ఇచ్చే ఒప్పందం మీద గంగను పల్లెటూళ్లో ఉన్న ఒక రైతు మిత్రుని దగ్గరకు తోలి, అది ఈన పొద్దులుగా ఉందని తెలిశాక తిరిగి తెచ్చుకునే వారు. ఇలా పెద్ద కష్టమేమీ లేకుండానే గంగని సాకారు.

తల్లిపాలు కరవైన పిల్లలెందరో గంగపాలు తాగి పెరిగారు. కానీ ఇపుడు దాని వల్ల జరిగిన మేలు మరుగునపడిపోయింది. అనాథగా వీధిపాలై, పట్టెడు గడ్డికి మొహం వాచి, ఆకలి జ్వాలల్ని తట్టుకోలేక, తినుబండారాల వాసనలతో ఉన్న ప్లాస్టిక్ సంచుల్ని తిని ప్రాణం మీదికి తెచ్చుకుంది.

గతం ఎవరికీ గుర్తు రాలేదు. ఈనాడది వ్యర్థజీవి.

"నువ్వు పాలిచ్చిన రోజుల్లో నీ కడుపు నిండేలా మేపిన వాళ్లే ఇప్పుడు, నువ్వు ముసలిదానివయ్యాక నీకు పట్టెడు తిండి పెట్టాలంటేనే వెనకాడుతున్నారు. తిండి కోసం అలమటించి ప్రాణాలు పోగొట్టుకునేలా చేశారు. ఈ కృతఘ్నుతను క్షమించగలవా గంగా" అంటూ, ఊరేగింపుగా సాగిపోతూ, క్రమంగా కనుమరుగవుతున్న ఆ గోమాత పార్థివ దేహానికి మనసారా కడసారిగా నమస్కరించింది సుభద్రమ్మ.

వృద్ధాప్యం అందరికీ సహజమే, కానీ అందరికీ ఒకలా ఉండదు. రేపు కాలూ చెయ్యీ ఉడిగాక తన బ్రతుకు ఏమవుతుందో అన్న ఆలోచన మనసులోకి వచ్చి గుండె బరువెక్కగా అసహాయంగా నిట్టూర్చింది సుభద్రమ్మ.

★

## ఒక్కో మనిషికో పిచ్చి

గత రెండేళ్ళుగా అమెరికాలోని విస్కాన్సిన్‌లోని హైస్కూలు ఆడపిల్లల చెప్పులు గల్లంతవుతున్నాయి. చివరికి పోలీసులు మాటు వేసి 27 సంవత్సరాల ఆ చెప్పుల దొంగని పట్టుకుంటే అతని గదిలో 1500 చెప్పులు



దొరికాయిట! 2005లో కూడా చెప్పులు దొంగిలించినందుకే అతనికి శిక్ష పడిందిట! ఆడపిల్లల చెప్పుల వాసన చూడటం అతనికో వ్యామోహమట! జైలుశిక్ష వేయగలరేకాని ఈ పిచ్చినెలా వదిలించాలో వైద్యనిపుణులకి అర్థం కావటం లేదు.

-విమల

